ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

మంగళవారం 22 జూలై 2025



మున్సిపల్ కాంప్లెక్సా.. పర్మిట్ రూమా..?!

నిత్యం రద్దీగా ఉండే సిద్దిపేట మున్సిపల్ కార్యాలయ కాంప్లెక్స్ ఇప్పుడు మద్యంప్రియులకు అడ్డాగా మారింది. కాంప్లెక్స్‌లోని దుకాణాలు సాయంత్రం మూసివేయగానే అక్కడ పరిస్థితి మారిపోతోంది. మద్యం ప్రియులు కాంప్లెక్స్ పైఅంతస్తుకు వెళ్లి అర్ధరాత్రి వరకు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ, దానిని పర్మిట్ రూంగా మార్చేశారు. ఎక్కడ చూసినా తాగిన మద్యం, బీరు బాటిళ్లు, గోడలపై పాన్‌పరాగ్ మరకలు, తాగిన సిగరెట్ ముక్కలు దర్శనమిస్తున్నాయి. కాంప్లెక్స్‌ను చక్కగా చూసుకోవాల్సిన దుకాణ యజమానులు కూడా ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. సిగరెట్లు తాగినా, గోడలపై ఉమ్మినా రూ. 1116 జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ పేరిట హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ ఇవేమి పట్టించుకోవడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనే కొందరు ఇలా రెచ్చిపోతున్నారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

- సిద్దిపేట, జూలై 21, (ఆంధ్రజ్యోతి)







చిరుజల్లులు

● జిల్లాలో పలుచోట్ల మోస్తరు వాన

సిద్దిపేట జూలై 21 ఆంధ్రజ్యోతి : జిల్లాలో సోమవారం పలు ప్రాంతాల్లో చిరుజల్లులు, సాధారణ వర్షం కురిసింది. సిద్దిపేట, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, దౌల్తాబాద్, హుస్నాబాద్ రూరల్, చిన్నకోడూరు, హుస్నాబాద్, బెజ్జంకి, కుకునూర్‌పల్లి, తొగుట, దుబ్బాక, మిరుదొడ్డిలో చిరుజల్లులు పడ్డాయి. చిరుజల్లులు కురుస్తున్న సమయంలో పెద్దలింగారెడ్డిపల్లి రంగనాయకసాగర్ కట్ట కింద మహిళా కూలీలు వరినాట్లు వేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక

కుమారుడి ఆత్మహత్యాయత్నం

● అతడి పరిస్థితిని చూసి మనోవేదనతో తల్లి మృతి

● విషయం తెలిసి చికిత్స పొందుతున్న కొడుకూ మృతి

● ఆకునూరులో విషాదం

రోడ్డు ప్రమాదంలో

తండ్రీకుమార్తె మృతి

కడుపునొప్పి భరించలేక

విద్యార్థిని ఆత్మహత్య

వార్తలు 6లో..

బకాయిల బెడద

● మూడు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్ ● కొత్త మెనూతో పెరిగిన భారం

● అప్పులు చేయాల్సి వస్తుందని వంట కార్మికుల ఆవేదన

● పలుచోట్ల విధులకు దూరం

● తప్పని పరిస్థితుల్లో వంట చేసి పెడుతున్న ఉపాధ్యాయులు

పేద విద్యార్థులకు ఆకలి తీర్చి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. బిల్లుల చెల్లింపులో జాప్యం, మూడు నెలలుగా పెండింగ్‌లో బకాయిలు, కొత్త మెనూ అమలుతో పెరిగిన ఖర్చులు వంట కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రోజుకు రూ.వంద కూడా గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేక కొంతమంది కార్మికులు విధులకు దూరమవుతున్నారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో, గొల్లపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులే వంటలు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక కొత్త మెనూ అమలుకు కలెక్టర్ వివిధ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మెనూ పాటించని పాఠశాలల్లో సిబ్బందికి నోటీసులు అందజేస్తున్నారు.



మధ్యాహ్న భోజన మెనూ



జగదేవ్‌పూర్‌లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

జగదేవ్‌పూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 636 ప్రాథమిక పాఠశాలలు, 115 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 228 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి 2500 మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.6.19, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.9.29 ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ. 10.67 చొప్పున చెల్లిస్తారు. కోడిగుడ్డుకు రూ. 6చొప్పున చెల్లిస్తుండగా, రోజు విడిచి రోజు విద్యార్థులకు భోజనంలో పెడుతున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60-40 శాతం చొప్పున నిధులను సమకూర్చుతాయి. 9,10 తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు చెల్లిస్తుంది. అయితే, గత మూడు నెలల మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కార్మికులు అప్పులు చేసి వంటలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

కొత్త మెనూతో ఇబ్బందులు

నూతన విద్యా సంవత్సరం నుంచి కొత్త మెనూ అమలులోకి వచ్చింది. కొత్త మెనూ వల్ల మరింత నష్టపోవాల్సి వస్తుందని వంట కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు పెరగడం, కొత్త మెనూ అమలుతో అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. మెనూ అమలుకు ధరలు కూడా పెంచాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు తిప్పలు

జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 రోజుల నుంచి వంట కార్మికులు రావడం లేదు. గిట్టుబాటు కావడం లేదని, వంట చేయలేమని వారు వెళ్లిపోయినట్టు హెచ్ఎం నరేందర్ తెలిపారు. వంటలు చేసేందుకు గ్రామంలో ఎవరిని పిలిచినా ఆసక్తి చూపకపోవడంతో

మిగతా 8వ పేజీలో



జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లిలో మధ్యాహ్న భోజనం వండుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)



ప్రయోగాత్మక బోధనకు పెద్దపీట

● పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ బడుల్లో వినూత్న బోధన

● అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు శ్రీకారం

● అందుబాటులోకి మరో 27 ల్యాబ్‌లు

● నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

సిద్దిపేట కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించేందుకు, ఆధునిక బోధనను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా పీఎంశ్రీ అనుబంధ పాఠశాలలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, విద్యార్థులకు నూతన విషయాలను, అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ నేపథ్యంలోనే అటల్ టింకరింగ్ ల్యాబ్స్(ఏటీఎల్) పేరిట ప్రయోగాత్మక బోధనను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. పిల్లలకు క్షేత్రస్థాయిలో ప్రయోగాలతో విషయాలను బోధిస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్న లక్ష్యంతో ఈ ల్యాబ్‌లను సమకూర్చింది. ఒక్కో ల్యాబ్‌కు దాదాపు రూ.10లక్షల వ్యయంతో భౌతిక, రసాయన, గణితం, జీవశాస్త్రానికి సంబంధించిన పలు పరికరాలను అందజేశారు. ఇప్పటికే జిల్లాలోని గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో 12 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉండగా, గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలకు మరో 27 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు అనుమతి లభించింది. వీటిని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ఏటీఎల్ ద్వారా అందజేసిన పరికరాలపై రాష్ట్రస్థాయి విషయ నిపుణులతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ఈనెల 22, 23న శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. జిల్లా నుంచి 27 పాఠశాలలకు చెందిన 81 మంది

మిగతా 8వ పేజీలో



నిజాంపేట మండలంలోని బాచేపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన యూ ఆకారపు సీటింగ్

గురుకులంలో యూ సీటింగ్

● సరికొత్త విధానం.. వినూత్న విద్యకు శ్రీకారం

● వెనుకబడిన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు..

● నిజాంపేట బాచేపల్లి గిరిజన మినీ గురుకుల పాఠశాలలో అమలు

కల్హేర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తరగతి గదుల్లో ముందు బెంచీలు, వెనుక బెంచీలు అనే విభజనతో కొన్నిసార్లు విద్యార్థుల్లో అసమానతలు చోటు చేసుకుంటాయి. ఉత్సాహం ఉన్నా, వెనుక బెంచీలో కూర్చున్నామనే భావనతో కొందరు నిరుత్సాహానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యకు పరిష్కారంగా, ఓ మలయాళ సినిమా లో చూపించిన యూ సీటింగ్ విధానం ఆలోచన నుంచి పాఠశాలలు స్ఫూర్తిని పొందుతున్నాయి. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో ఈ విధానాన్ని ప్రారంభించారు.



కేవలం చదువులో ముందున్నవారికే కాదు, అందరి విద్యార్థులకూ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మొదటిసారిగా బాచేపల్లిలో చేపట్టిన ఈ విధానం ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రశంసలు అందుకుంటోంది. ఈ వినూత్న పద్ధతిలో, తరగతి గదిలో మూడు వైపులా బెంచీలను గోడకు ఆనించి యూ ఆకారంలో సీటింగ్ ఏర్పాటు చేస్తారు. బ్లాక్ బోర్డు, పాఠాలు బోధించే ఉపాధ్యాయులు స్పష్టంగా కనిపించేలా, మరో వైపును ఖాళీగా ఉంచుతారు. దీనివల్ల ప్రతీ విద్యార్థిపైనా ఉపాధ్యాయుల దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంటుంది. అలాగే, ఉపాధ్యాయుడు బోర్డుపై రాసే పాఠాలు, బోధన తీరు విద్యార్థులందరికీ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ విధానంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి అపారంగా పెరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అందరిలోనూ సమానత్వం, సమష్టితత్వం పెంపొందే ఈ యూ సీటింగ్ విధానం ఇతర పాఠశాలలకూ ఆదర్శంగా నిలవనుంది.

విద్యార్థులందరూ సమానమే

యూ సిటింగ్ విధానంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. తరగతి గదిలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భావనకు చోటు లేకుండా అందరూ సమానమే అని తెలియజెబుతున్నాం. ఇలా కూర్చోవడం విద్యార్థుల్లోనూ ఉత్సాహాన్నిస్తుంది. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిని కనిపెట్టగలుగుతారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో ఈ విధానం అమలు జరుపుతామని అధికారులు ప్రకటించగా మేము ముందే యూ సిటింగ్‌ను అమలు చేశాం.

- కవిత, హెచ్ఎం, గిరిజన మినీ గురుకుల పాఠశాల, బాచేపల్లి

కాంగ్రెస్ పాలనలో అక్రమ కేసులు,

చిల్లర మాటలే..

● ఎలాంటి అభివృద్ధి లేదు.. రెండేళ్లలో సీన్ రివర్స్

● స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదాం

● మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



గజ్వేల్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గజ్వేల్/సిద్దిపేట జూలై 21, ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ పాలనలో అక్రమ కేసులు, చిల్లర మాటలే తప్ప అభివృద్ధి ఏ మాత్రం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం 18 నెలల్లోనే తెలంగాణలో సీన్ రివర్స్ అయ్యిందన్నారు. వితంతువులు, వృద్ధులకు పింఛన్లు రావడం లేదని, 20 నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వకపోగా, రెండు లక్షల పింఛన్లు ఆయా కారణాలతో కట్ చేశారన్నారు. 20 నెలల్లో రెండు నెలల పింఛన్ ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా గ్రామాల్లో చెత్తబండ్లకు తాళాలు వేశారని, చెత్త ఎత్తే పరిస్థితి ఎక్కడా లేదన్నారు. నాలుగు విడతల్లో రెండు విడతల రైతుబంధు ఎగ్గొట్టారని, గతంలో కరోనా వచ్చినా ఎమ్మెల్యేలు, ఉద్యోగాల జీతాలు ఆగాయి కానీ రైతు బంధు ఆగలేదన్నారు. ప్రస్తుతం రెండు రైతు బంధులు ఎగ్గొట్టారని, నాడు కేసీఆర్ నాట్లకు రైతుబంధు ఇస్తే రేవంత్ ఓట్లకు ఇస్తున్నాడన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందాం

రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటి, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిపించుకుందామమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట రూరల్ మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ, పెన్షన్, ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశాడన్నారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ గన్‌మన్‌లు లేకుండా అశోక్ నగర్ రావాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, దీంతో విద్యార్థులు పై చదువులు చదువుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, కొందరు విద్యార్థులు చదువు మానేసే పరిస్థితులు వచ్చినట్లు చెప్పారు. మనమంతా కుటుంబ సభ్యుల్లా కలిసికట్టుగా పని చేద్దామని, ఎట్లుండే తెలంగాణ ఎట్లైందని గ్రామస్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా చర్చలు పెట్టి వివరించాలని సూచించారు.



సీఎం సమీక్షలో కలెక్టర్

సిద్దిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి ఆమెతో పాటు అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమ్మద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సర్వే, హద్దుల నిర్ధారణకు ఉపయోగించిన విమానం ఆకారంలోని డ్రోన్

భూ వివాదాలకు చెక్

పారదర్శక రికార్డులకు బాట

- షాహెద్‌నగర్‌లో భూభారతి రీ సర్వే విజయవంతం
- నెలరోజుల్లోపే కచ్చితత్వంతో పూర్తి
- అక్షాంశ, రేఖాంశాలతో ప్రతీ ఎకరాకు జియోట్యాగింగ్
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు షాహెద్‌నగర్ ఆదర్శం

జోగిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలులోకి తీసుకొచ్చిన భూభారతి రీ సర్వే సత్ఫలితాలు అందోలు నియోజకవర్గంలో నుంచి ప్రారంభమయ్యాయి. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన నియోజకవర్గ పరిధిలోని వట్‌పల్లి మండలం షాహెద్‌నగర్(గట్‌పల్లి) గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే విజయవంతంగా పూర్తయ్యింది. కేవలం 28 రోజుల్లోనే సర్వే పూర్తి కావడం విశేషం. దీంతో భూ వివాదాల పరిష్కారానికి నూతన మార్గం సుగమమైంది. పారదర్శక రికార్డులకు బాట పడనుంది.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ప్రతీ 25 ఏళ్లకు ఒకసారి భూముల రీ సర్వే జరగాలి. కానీ, దశాబ్దాలుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభమైనా, తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అటకెక్కింది. దీంతో హద్దులు, విస్తీర్ణంపై రైతుల్లో వివాదాలు, భౌతిక దాడులు, కోర్టు కేసుల వరకు దారితీశాయి. ఈ సమస్యలను గుర్తించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, భూముల రీ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాల్లో ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందులో సంగారెడ్డి జిల్లాలోని షాహెద్‌నగర్ పాటు మహబూబ్‌నగర్ జిల్లాలో సలార్‌నగర్, జగిత్యాల జిల్లాలో కొమ్మనాపల్లి, ఖమ్మం జిల్లాలో ములుగుమడ, ములుగు జిల్లాలో నూగురు గ్రామాలు ఉన్నాయి.

షాహెద్‌నగర్ ఎంపిక వెనుక...

షాహెద్‌నగర్ (గట్‌పల్లి) సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను ఆనుకొని ఉంది. ఇది చిన్న గ్రామం. కేవలం 21 సర్వే నంబర్లలో 574 ఎకరాల వ్యవసాయ భూమి (293 మంది పట్టాదారులు) ఉండటంతో పైలట్ ప్రాజెక్టుకు అనుకూలంగా భావించి ఎంపిక చేశారు. మొత్తం 824 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో మే చివరి వారంలో రీ-సర్వే ప్రారంభమైంది. అప్పటి కలెక్టర్ క్రాంతి వల్లూరి పనులను పర్యవేక్షించారు.

ఆధునిక పద్ధతులతో కచ్చితమైన సర్వే

జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) ఐనేష్ ఆధ్వర్యంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, అందోలు - వట్‌పల్లి మండలాల సర్వేయర్ మురళీధర్ బృందం సర్వేను నిర్వహించింది. నియో జియో అనే సంస్థ సాంకేతిక సహాయం అందించింది. సాంప్రదాయిక గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతితోపాటు ఏరియల్/డ్రోన్ సర్వే పద్ధతులను వినియోగించారు. మొదట, ప్రతిరోజూ రెండు సర్వే నంబర్లను ఎంచుకొని, ఆయా భూముల యజమానులను పిలిచి వారి హద్దులు చూపాల్సిందిగా కోరారు. పక్కన ఉన్న రైతులను కూడా పిలిచి, వారి సమక్షంలోనే నిజాం కాలం నాటి బై, ట్రై జంక్షన్ల ఆధారంగా చైన్లతో కొలిచి హద్దులను నిర్ధారించారు. ఇలా గ్రామంలోని మొత్తం 21 సర్వే నంబర్ల భూముల సర్వేను పూర్తి చేశారు. తర్వాత, ఈ హద్దులను అత్యాధునిక డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ (డీజీపీఎస్) పద్ధతి ద్వారా సరిపోల్చారు.

కేవలం 2 సెం.మీ. తేడా

నియో జియో సంస్థ డ్రోన్లతో సర్వే చేయగా, 2 సెంటీమీటర్ల తేడా మాత్రమే నమోదైంది. ప్రభుత్వం 10 సెంటీమీటర్ల తేడాకు అనుమతించినా, ఇక్కడ మాత్రం అధికారులు మరింత కచ్చితత్వంతో 2 సెంటీమీటర్ల తేడాతోనే సర్వే పూర్తి చేయడం విశేషం. ప్రతి సర్వే నంబర్‌లోని భూమికి అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సరైన లోకేషన్‌ను నిర్ణయించి, కచ్చితమైన జియో ట్యాగింగ్ చేశారు. ఈ సర్వే ఆధారంగా జియో రిఫరెన్స్ క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారు చేశారు. షాహెద్‌నగర్ గ్రామ నక్షా (మ్యాప్)ను రూపొందించి, గ్రామ భూ రికార్డులను నవీకరించారు. భవిష్యత్తులో అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా భూమి విస్తీర్ణం, హద్దులు సులువుగా గుర్తించవచ్చు.

రీ సర్వేలో గుర్తించినవి

రీ సర్వేలో పలు కీలక సమస్యలు బయటపడ్డాయి పట్టా ఉన్నా, కబ్జాలో లేకపోవడం, కబ్జాలో ఉన్నా, పట్టా లేకపోవడం, పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న విస్తీర్ణానికి, కబ్జాలో ఉన్న విస్తీర్ణానికి తేడాలు, కొన్ని అడుగుల తేడాతో గట్టు పంచాయితీలు, టైటిల్‌లో ఉన్న విస్తీర్ణానికి, పహాణీలోని విస్తీర్ణానికి తేడాలు, కుటుంబం మొత్తానికీ సంయుక్తంగా ఉన్న భూ విస్తీర్ణం, పంపకాల తర్వాత విస్తీర్ణంలో తేడాలు, ఈ సమస్యలన్నింటినీ క్రోడీకరించి రెవెన్యూ మంత్రికి నివేదిక సమర్పించారు. దీనిపై ప్రభుత్వం ఆర్డినెన్స్ లేదా చట్టం చేయనుంది.

2 సెం.మీ. తేడాతోనే హద్దుల గుర్తింపు



ప్రభుత్వం చేపట్టిన భూభారతి రీ సర్వే భూ యజమానులకే కాకుండా, ప్రభుత్వాధికారులకు ఎంతో ఉపయుక్తం. ప్రభుత్వం 10 సెంటీమీటర్ల (సెం.మీ.) తేడాతో హద్దులు గుర్తించమని ఆదేశించినా, మేము నియో జియో సంస్థతో కలిసి కేవలం 2 సెం.మీ. తేడాతోనే హద్దుల్ని గుర్తించాం. ఇది అత్యంత కచ్చితమైన సర్వే. దీనివల్ల భూ సంబంధిత వివాదాలు తగ్గుతాయి.

- మురళీధర్, సర్వేయర్

రీ సర్వేతో భవిష్యత్‌లో సమస్యలు తలెత్తవు



నిజాం కాలం నాటి సర్వేనే నేటికీ అమలులో ఉండగా, ఇప్పుడు చేపట్టిన రీ సర్వే ఎంతో ప్రతిష్ఠాత్మకం. సెం.మీ. తేడాతో భూ హద్దులను గుర్తించడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తవు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా జియో మ్యాపింగ్ చేయడం వల్ల ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా భూమి హద్దులు, విస్తీర్ణం కచ్చితంగా తెలుసుకోవచ్చు. దీనివల్ల రాబోయే తరాలకు భూ సమస్యలు, వివాదాల నుంచి విముక్తి కలుగుతుంది. ఈ సర్వేలో బయటపడ్డ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిస్తాం.

- పాండు, ఆర్డీవో, అందోలు-జోగిపేట డివిజన్


రైతుల సమక్షంలో భూ హద్దులను, గుర్తిస్తున్న అధికారులు

ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న కోహీర్ పోలీసులు

కోహీర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : 400 గ్రాముల ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామని కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్‌వర్మ తెలిపారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలో గల నయారా పెట్రోల్ పంపు ముందు సోమవారం మధ్యాహ్నం కోహీర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న న్యాల్‌కల్ మండలంలోని డప్పూరు గ్రామానికి చెందిన మంగలి రవీందర్ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా.. అతని వద్ద 400 గ్రాముల ఎండు గంజాయి లభించిందని ఎస్‌ఐ తెలిపారు. రవీందర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కల్లు సీసా పగులగొట్టి దాడి

- తృటిలో తప్పిన ప్రాణాపాయం

జోగిపేట రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షల నేపథ్యంలో.. ఓ వ్యక్తి కల్లు సీసా పగులగొట్టి ఓ యువకుడిపై దాడిచేసిన ఘటన మండలంలోని తాలెల్మ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. జోగిపేట ఎస్‌ఐ పాండు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనిల్(28), మల్లేశం(40) ఎదురెదురు ఇళ్లల్లో నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉన్నాయి. సోమవారం సాయంత్రం కల్లు దుకాణం వద్ద ఇద్దరూ ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మల్లేశం కల్లు సీసాను పగులగొట్టి అనిల్‌పై దాడిచేశాడు. అదృష్టవశాత్తు అనిల్ స్వల్పగాయాలతో బయటపడడంతో ప్రాణాపాయం తప్పింది. పక్కనే ఉన్నవారు గమనించి అనిల్‌ను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై అనిల్ కుటుంబసభ్యులు జోగిపేట పోలీసులకు సమాచారమందించారు. ఇదిలా ఉండగా ఇటు బాధితుడు అనిల్, దాడికి పాల్పడ్డ మల్లేశం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం విశేషం.

అపహరించిన డబ్బులు అప్పగింత

శివ్వంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నుంచి యువకులు అపహరించక పోయిన డబ్బులను తిరిగి బాధిత కుటుంబీకులకు అప్పగించిన సంఘటన సోమవారం మండల పరిధిలో గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఓ గ్రామంలో ఓ విద్యార్థి తన పెద్దనాన్న ఇంట్లోంచి రూ.లక్ష నగదును అపహరించుకుపోయాడు. తన దగ్గర డబ్బులు ఉన్నాయని తోటి స్నేహితులకు తెలపడంతో విషయం బయటపడింది. ఇటీవల రూ.63 వేలు ఇచ్చాడు. గ్రామస్థులు నిలదీయడంతో మిగిలిన రూ.37 వేలు సోమవారం అప్పగించాడు.

వర్షాలు కురిపించాలని..

- 108 కమలాలతో శివుడికి అభిషేకం

కల్హేర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురిపించాలని మండల పరిధిలోని మహదేవ్‌పల్లికి చెందిన గ్రామస్థులు స్థానిక సంగమేశ్వర ఆలయంలో 108 కమలం పువ్వులతో శివుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి మల్లయ్యమహరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. వర్షాలు కురిపించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిలుమహరాజ్, సీహెచ్ బాలయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.


మహదేవ్‌పల్లి శివారులోని సంగమేశ్వర ఆలయంలో 108 కమలాలతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తె మృతి

సిద్దిపేట అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా రహీమాపూర్ గ్రామానికి చెందిన మంతోష్‌కుమార్(26) భార్య ముగ్గురు కుమార్తెలతో కలిసి ఐదునెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కస్తూరి పల్లి వ్యవసాయ ఫామ్ హౌస్‌లో పనిచేయడానికి వచ్చారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామ శివారులో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తున్న తన అక్క బావను కలవడానికి మంతోష్‌కుమార్ తన కుమార్తె ఝాన్సీ(4)తో కలిసి కస్తూరి పల్లె నుంచి వెల్కటూర్‌కు ఆదివారం చార్జింగ్ స్కూటీపై బయలుదేరాడు. రంగదాంపల్లి శివారు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో మంతోష్‌కుమార్ అక్కడికక్కడే చనిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పాపను చికిత్స నిమిత్తం పక్కనే ఉన్న సురభి మెడికల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే పాప చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. కారు డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించి ఉన్నట్లు తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కుమారుడి ఆత్మహత్యాయత్నం

- అతడి పరిస్థితిని చూసి మనోవేదనతో తల్లి మృతి
- విషయం తెలిసి చికిత్స పొందుతున్న కొడుకూ మృత్యువాత
- సిద్దిపేట జిల్లా ఆకునూరులో విషాదం



రమేశ్ (ఫైల్), సుజాత(ఫైల్)

చేర్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. అతడి పరిస్థితిని చూసి తల్లడిల్లిపోయిన అతని తల్లి తీవ్ర మనోవేదనతో ఈ నెల 18న మృతిచెందింది. తల్లి మృతితో మరింత ఆందోళనకు గురైన కుమారుడు సోమవారం చనిపోయాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో విషాదం నింపింది. ఆకునూరుకు చెందిన భూమిని సుజాత(50) అంగన్‌వాడీ కేంద్రంలో రెండో కార్యకర్తగా పనిచేస్తోంది. ఆమె ఒక్కగానొక్క కుమారుడు భూమిని రమేశ్(36) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ అతని భార్య, ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. రమేశ్ కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో గత వారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. అప్పటి నుంచి కుమారుడి పరిస్థితిపై సుజాత ఆందోళన చెందుతోంది. ఈ క్రమంలో ఈ నెల 18న ఆమె చనిపోయింది. తల్లి మరణించినప్పటి నుంచి తీవ్ర మనోవేదనలో ఉన్న రమేశ్ సోమవారం ఆస్పత్రిలో మృతి చెందాడు. రమేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

'నిఘా' నీడలో..



ప్రభుత్వ ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల బలోపేతానికి ఇంటర్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. కళాశాలల్లో బోధన తీరు మెరుగుపరిచేందుకు గదుల్లో విద్యార్థుల కదలికలను కనిపెట్టి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దే చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో పాటు తరగతి గదుల్లో సుమారు 16 సీసీ కెమెరాలు బిగించి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. అక్కడి సిబ్బంది ప్రతిరోజు ఆయా కళాశాలల కదలికలు పరిశీలించనున్నారు. దీంతో జూనియర్ కళాశాలలపై ఇంటర్ బోర్డు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండనున్నదని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

- సంగారెడ్డి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి)

క్రైం కార్నర్

పనికోసం వచ్చిన 20 రోజులకే అనంతలోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి
- మృతుడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా


జాతీయ రహదారిపై తేజ మృతదేహం

మనోహరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పనికోసం వచ్చిన 20 రోజులకే ఓ యువకుడిని ఆర్టీసీ బస్సు కబళించింది. ఈ ఘటన మనోహరాబాద్ మండల పరిధిలో సోమవారం ఉదయం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా, చౌడవరం మండలం, బోగపురం గ్రామానికి చెందిన కానుక తేజ(19) మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి గ్రామానికి చెందిన తన స్నేహితుల వద్దకు 20 రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం రాత్రి స్నేహితులు ప్రవీణ్, మురళీ, పోరుబిల్లి లోకేష్‌తో కలిసి మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ శివారులోని ఫాంహౌస్‌కు వచ్చాడు. తిరిగి సోమవారం ఉదయం స్కూటీపై గుండ్లపోచంపల్లికి వెళ్తుండగా.. కాళ్లకల్ శివారులోని 44 జాతీయ రహదారి రాఘవేంద్ర హోటల్ వద్ద హైదరాబాద్‌కు వెళ్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు స్కూటీని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న నలుగురు స్నేహితులు కిందపడ్డారు. ఈ ఘటనలో తేజ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా గుండ్లపోచంపల్లిలో నివాసముంటున్న లోకేష్ గ్రామానికి చెందిన నాగవెంకట అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఘటనపై అప్పలనాయుడు బాధితుల, మృతుడి కుటుంబీకులకు సమాచారమందించాడు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


సాయికృష్ణ(ఫైల్)

తూప్రాన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చిన్నలింగ్ సాయికృష్ణగౌడ్(29) డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటూ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం అప్పులు చేశాడు. అయితే అవి తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. ఈనెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మేనమామ కంచనపల్లి సత్యంగౌడ్‌కు వివరించాడు. సత్యంగౌడ్ వెంటనే సాయికృష్ణగౌడ్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి చిన్నాన్న సురేశ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని..

- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఘటన


అఖిల (ఫైల్)

చిన్నకోడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నకోడూరులో సోమవారం జరిగింది. ఎస్‌ఐ సైఫ్ అలీ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు గ్రామానికి చెందిన దానబోయిన రాజు, లక్ష్మీ దంపతులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. రెండో కూతురు అఖిల(19) డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అఖిల కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా కుటుంబసభ్యులు గ్రామంలోని ఓ ఆర్‌ఎంపీ వద్ద చూపించారు. అయినా తరచూ నొప్పి వస్తుందని చెబుతుండేది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్తుండగా అఖిల నాకు మళ్లీ కడుపు వస్తుందని చెప్పగా.. పొలం నుంచి వచ్చాక సిద్దిపేటలోని ఆస్పత్రికి వెళ్దామని సర్దిచెప్పి వెళ్లారు. కొంతసేపటి తర్వాత ఇంటికొచ్చిన తండ్రికి కూతురు చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమారుడికి అనారోగ్యం..

- కలత చెంది తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి


అమ్రిభాయి(ఫైల్)

కల్హేర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కుమారుడికి నెలల తరబడి చికిత్స అందిస్తున్నా ఆరోగ్యం బాగుపడకపోవడంతో కలత చెందిన తల్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి.. చికిత్స పొందుతూ మృతిచెందింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని పోమ్యానాయక్‌తండాకు చెందిన ధరావత్ శివరాం, అమ్రిభాయి(48) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు కిషన్, కునాల్ ఉన్నారు. రెండో కుమారుడు కునాల్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. నిమ్స్ ఆస్పత్రిలో నెలల తరబడి చికిత్స చేయించినా నయం కాకపోవడంతో తల్లి కలత చెందింది. దీంతో ఈ నెల 19న తండాలోని తన ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన పెద్ద కుమారుడు కిషన్ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. భర్త శివరాం సోమవారం కల్హేర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో శవ పరీక్ష జరిపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

జహీరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్(40) ఆదివారం మహేశ్వరీ థియేటర్ వద్ద పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం ఇస్మాయిల్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

కొడుకుతో సహా తల్లి అదృశ్యం


తల్లి శ్రీలతతో శివ(ఫైల్)

పెద్దశంకరంపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కొడుకుతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన పెద్దశంకరంపేట పట్టణంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన లింగాయపల్లి బూదెమ్మ తన ఒక్కగానొక్క కూతురు శ్రీలతను ఏడేళ్ల క్రితం మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామానికి చెందిన సాయిలుకు ఇచ్చి వివాహం జరిపించింది. అయితే భర్త సాయిలు రెండేళ్లుగా ఇంటికి రావడం లేదు. దీంతో శ్రీలత కుమారుడితో కలిసి తల్లి వద్దే ఉంటోంది. కాగా గతనెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీలత కుమారుడిని తీసుకుని వెళ్లిపోయింది. ఆందోళన చెందిన తల్లి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి బూదెమ్మ సోమవారం పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఓ కుటుంబానికి చెందిన ఐదుగురు కొన్నిరోజుల క్రితం బీదర్ నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. 65వ నంబరు జాతీయ రహదారిపై కంది సమీపంలో ఉన్న ఓ దాబాలో భోజనం చేసేందుకు ఆగారు. దాబాలో భోజనం చేసి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. సాయంత్రానికి ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురై.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. వారిని పరీక్షించిన వైద్యులు ఫుడ్ పాయిజన్ అయిందని స్పష్టం చేశారు. దీంతో సదరు కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాలతో సంగారెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దాబాలో తనిఖీలు చేశారు. దాబాలో మాంసం ఇతర ఆహార పదార్థాలన్నీ నిల్వ ఉంచినవే వాడుతున్నట్టు గుర్తించారు. దాబా నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు.

కంది సమీపంలోని మరో దాబాలో కూడా కొన్నిరోజుల క్రితం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. వంటకాల్లో రంగులు వాడుతున్నట్టు అధికారులు గుర్తించారు. వంటశాలంతా అపరిశుభ్రంగా ఉండటంపై మండిపడ్డారు. కలర్స్ ఉపయోగించి వండిన వంటకాలను పారబోశారు. వినియోగదారులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సదరు దాబా యజమానికి ఆదేశించారు. దాబాకు నోటీసులు అందజేసి మళ్లీ ఇలాగే కొనసాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వికార భోజనంబు..!

ఆకర్షణీయంగా బోర్డులు.. నాణ్యత లేని ఆహారం

- ధనార్జనే ధ్యేయంగా దాబాల నిర్వహణ
- నాణ్యతపై ప్రశ్నిస్తే బౌన్సర్లతో బెదిరింపులు
- డబ్బులిచ్చి జబ్బులు కొంటున్న వినియోగదారులు
- 65వ నంబరు జాతీయ రహదారిపై దాబాల ఇష్టారాజ్యం



కంది సమీపంలోని ఓ దాబాలో వంటకాల్లో వినియోగిస్తున్న కలర్స్

సంగారెడ్డి క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : 65వ నంబరు జాతీయ రహదారిపై 24/7 వాహనాల రద్దీ. హైదరాబాద్-ముంబయి, మహారాష్ట్రలకు ఇదే ప్రధాన రహదారి. దీంతో ఈ రహదారికి ఇరువైపులా దాబాలే దర్శనమిస్తాయి. ప్రయాణికులను ఆకర్షించేందుకు రంగు రంగుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆకర్షణీయమైన ఫ్లెక్సీలు చూసి, అద్దాల మేడలు చూసి అక్కడ భోజనం చేశామో... అంతే సంగతి. డబ్బులు ఇచ్చి జబ్బులు కొనుక్కోవడమే అవుతుంది. సంగారెడ్డి జిల్లా సరిహద్దు అయిన రామచంద్రపురం నుంచి జహీరాబాద్ వరకు వందల సంఖ్యలో దాబాలు వెలిశాయి. ఆయా దాబాలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ వినియోగదారుల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయి. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి దాబాల్లో తిన్న తర్వాత అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నాడు. నిల్వ ఉంచిన చికెన్, మటన్‌లతో వినియోగదారులకు వడ్డిస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో వెల్లడవుతోంది.

వీకెండ్స్‌లో దాబాలు, హోటళ్లన్నీ కిటకిట

జాతీయ రహదారి పక్కనున్న దాబాలన్నీ వీకెండ్స్‌లో వాహనాల రద్దీ, వినియోగదారులతో కిటకిటలాడుతుంటాయి. సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లోని ప్రజలు శని, ఆదివారాల్లో విహార యాత్రలకు వెళ్లి ఆయా దాబాల్లో భోజనం చేస్తుంటారు. దీంతో ఆయా దాబాల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా పెట్టుకొని నాసిరకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఉడికీ ఉడకని చికెన్, మటన్ ఇస్తున్నారు. కొన్ని రోజుల పాటు ఫ్రిడ్జిలలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వేడి చేసి ఇస్తుండటంతో వినియోగదారులు అస్వస్థతకు గురవుతున్నారు.

నోరూరించే టేస్టీ పొడర్లు.. కనువిందు చేసే కలర్స్

దాబాల్లో వినియోగదారులకు నోరూరించేందుకు టేస్టీ పొడర్లను వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులు వాడుతున్నారు. ఎంతో ఇష్టంగా తీసుకొనే బిర్యానీలు సైతం సరిగ్గా ఉడకడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒక్కోసారి బిర్యానీ తిన్న తర్వాత కడుపులో యాసిడిటీ వంటి వాటితో బాధ పడాల్సివస్తోందని అంటున్నారు. వంటకాల్లో టేస్టీ పొడర్లు, కలర్స్ వాడటం వల్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందంటున్నారు.

నిర్లక్ష్యంతో సమాధానం

జాతీయ రహదారిపై కంది సమీపంలో కొన్ని దాబాల్లో ఆహార నాణ్యతపై వినియోగదారులు ఎవరైనా ప్రశ్నిస్తే దాబాల నిర్వాహకులు బౌన్సర్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మెనూలో ప్రతి ఐటెంకు రూ.100 వసూలు చేస్తున్నా.. నాణ్యమైన ఆహారం అందించడం లేదని వాపోతున్నారు. పోలీసులు, అధికార పార్టీ నేతల అండ తమకు మెండుగా ఉందని, ఏమైనా చేసుకోండని సదరు దాబాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. తీసుకుంటున్న డబ్బులకు తగ్గట్టుగా దాబాల నిర్వాహకులు నాణ్యమైన ఆహారం అందజేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.



కంది సమీపంలోని ఓ దాబాలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు(ఫైల్)

గుగ్గిళ్ల గ్రామాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి



ఆర్టీసీ బస్సులో సతీమణితో కలిసి ప్రయాణిస్తున్న హైకోర్టు జడ్జి శ్రావణ్‌కుమార్

బెజ్జంకి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుగ్గిళ్ల గ్రామాన్ని (తన సొంత గ్రామం) సోమవారం హైకోర్టు జడ్జి నచ్చరాజు శ్రావణ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నుంచి గుగ్గిళ్ల మీదుగా వేములవాడ, హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులను తన తల్లి శారదాదేవి, సతీమణి కవిత ప్రారంభించారు. గ్రామంలో కొంతదూరం వరకు ఆర్టీసీ బస్సులో సతీమణితో కలిసి ఆయన ప్రయాణించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెల్త్ క్యాంపును పరిశీలించారు. అంతకముందు గ్రామానికి వచ్చిన హైకోర్టు జడ్జికి తహసీల్దార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ సౌజన్య ఆర్టీసీ కరీంనగర్ డిపో రీజినల్ మేనేజర్ వెంకన్న, హుస్నాబాద్ డిపో మేనేజర్ కిరణ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎస్ఐ మోడరేట్‌గా రెవరెండ్ డాక్టర్ రూబెన్ మార్క్



రూబెన్ మార్క్‌ను సన్మానిస్తున్న మెదక్ కమిటీ సభ్యులు

మెదక్, కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చర్చి ఆఫ్ సౌత్ ఇండియా(సినాడ్)కు మోడరేట్‌గా మెదక్ చర్చి ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ డాక్టర్ రూబెన్ మార్క్ ఎన్నికయ్యారు. ఈ చర్చి మోడరేట్ కోసం సోమవారం చెన్నైలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 23 డయాసిస్‌లు ఉన్న దక్షిణ భారత దేశంలని అతిపెద్ద చర్చి ఆఫ్ సౌత్ ఇండియాలో మొత్తం 307 ఓట్లకు గాను రూబెన్ మార్క్‌కు 197 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థి నిత్యానంద శర్మకు 117 ఓట్లు వచ్చాయి. 80 ఓట్ల ఆధిక్యంతో రూబెన్ మార్క్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మెదక్ ఇన్‌చార్జి బిషప్‌గా విధులు నిర్వర్తిస్తూ అత్యున్నత మోడరేట్‌కు ఎన్నికైన రూబెన్ మార్క్‌ను ఇక్కడ సీఎస్ఐ కమిటీ సభ్యులు చెన్నైలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంట సంపత్, నీరుడి సంజయ్, ప్రభాకర్, సుశీల్, సూరజ్, చైతన్య దాస్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, జూలై 21,(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందుతున్న తీరును, సదుపాయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్యం కోసం వచ్చే పేషెంట్లకు మెరుగైన, నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని, పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిలో నమ్మకం కల్గేలా వైద్యం కల్పించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ వినయ్, సిబ్బంది నరేందర్ రెడ్డి, సావిత్రి, తదితరులున్నారు.



పటాన్‌చెరు : గోకుల్‌నగర్‌లో ఊరేగింపుగా బోనాలను తీసుకెళ్తున్న మహిళలు



పుల్‌కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో బోనాలతో మహిళలు



నర్సాపూర్‌లో ఆషాఢమాస ఉత్సవాల్లో భాగంగా గ్రామదేవతలకు బండ్లు, బోనాల ఊరేగింపు

బోనం సంబురం

పటాన్‌చెరు/పుల్‌కల్/నర్సాపూర్/తూప్రాన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బోనాల సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పటాన్‌చెరు పారిశ్రామికవాడలో, పుల్‌కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామంలో, నర్సాపూర్‌లో, తూప్రాన్‌లో మహిళలు బోనమెత్తారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని అమ్మవారి ఆలయం వద్ద పెద్ద ఎత్తున మహిళలు బోనాలు సమర్పించారు. గోకుల్‌నగర్, పోచమ్మబస్తీలోని ఏడుగుళ్ల పోచమ్మఆలయం, ముదిరాజ్‌బస్తీ, గోనెమ్మబస్తీ, ఆల్విన్‌కాలనీ, బండ్లగూడ, జేపీ కాలనీ, శాంతినగర్ తదితర కాలనీలలోని అమ్మవారి ఆలయాల వద్ద పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక మహంకాళీ ఆలయం నుంచి ఫలహారం బండి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో ఉజ్జయిని మహంకాళీ జాతర ఉత్సవాలు రెండో రోజు సోమవారం ఘనంగా కొనసాగాయి. పట్టణంలో మహంకాళీ ఆలయం వద్ద సోమవారం గావు, రంగాలు నిర్వహించారు. సుజాత భవిష్యవాణి వినిపించారు.



తూప్రాన్‌లో

అచ్యుతానందన్ మృతి కార్మిక, కష్టజీవులకు తీరని లోటు

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



సంగారెడ్డిలో కేకే భవన్‌లో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతానందన్ మృతి కార్మిక, కష్టజీవులకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలో కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతానందన్ నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన మహోన్నత వ్యక్తి అని, కేరళ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, సాయిలు, మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, మహిపాల్, విద్యాసాగర్, నాగేశ్వర రావు, కృష్ణ, యాదగిరి, నాయకులు పాండు, రంగారెడ్డి, అశోక్, రమేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చీలపల్లిలో ఘనంగా పీర్ల పండుగ



చీలపల్లిలో పీర్ల పండుగ నిర్వహిస్తున్న భక్తులు

మునిపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చీలపల్లి గ్రామంలో సోమవారం నాడు పీర్ల పండుగను కులమతాలకతీతంగా ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామ పురవీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాలకంటి వీరన్నపాటిల్, సురేష్‌పాటిల్, చిన్నపాటిల్, ఎండీ.అప్సర్, మీరా సాబ్, నాగరాజు, ఎండీ.సాజిద్, ఎం.పాండు, ఎండీ.ఫెరోజ్, ఎండీ.ఇమామ్‌సాబ్, చందు పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి 'సహారా' వైద్యం

- ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు సేవలు
- మొబైల్, కంటైనర్ వాహనాల ద్వారా సత్వర వైద్యం



సహారా మొబైల్ వాహనం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

సంగారెడ్డి అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేదలకు వైద్య సహాయం అందించడంలో 'సహారా' స్వచ్ఛంద సంస్థ ముఖ్యపాత్ర పోషిస్తోంది. సంగారెడ్డి జిల్లా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తూ జిల్లావ్యాప్తంగా ఆరోగ్యపరంగా ప్రజలకు విశేష సేవలందిస్తూ ప్రశంసలు అందుకుంటోంది. దశాబ్ద కాలం క్రితం ఏర్పాటైన సహారా సొసైటీ జమ్మూకశ్మీర్, ఒడిషా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నాలుగు రాష్ట్రాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తోంది. ఇప్పటి వరకు 10 లక్షల మందికి పైగా ఆరోగ్య సేవలను అందించింది. ప్రధానంగా ఎదుగుదల లోపం ఉన్న పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తుంది.

మొబైల్, కంటైనర్ వాహనాలతో వైద్యం

సహారా స్వచ్ఛంద సంస్థ సత్వర వైద్య సేవలందించడంలో భాగంగా మొబైల్, కంటైనర్ వాహనాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువచేసింది. గ్రామాల్లో ప్రత్యేక రుగ్మతలకు స్ర్కీనింగ్ పరీక్షలు, వైద్య సలహాలు, మందులతో పాటు ప్రాథమిక చికిత్సలు పూర్తిగా ఉచితంగా అందిస్తోంది టెలీ కన్సల్టేషన్ ద్వారా స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నారు. జిల్లాలోని కంగ్టి, వట్‌పల్లి ప్రాంతాల్లో తాత్కాలిక కంటైనర్ ద్వారా రూరల్ హెల్త్ సెంటర్లు నెలకొల్పారు. ఎలక్ట్రిక్ ఆటో వాహనాల ద్వారా రోగులకు ఉచితంగా పిక్ అండ్ డ్రాప్ రవాణా సదుపాయం కల్పించి సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తున్నారు.

ఉచిత ఆపరేషన్లు

సంగారెడ్డి పట్టణంలోని సహారా ఇన్‌క్లూజివ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులైన పిల్లలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎదుగుదలలో లోపాలు కలిగిన పిల్లలతో పాటు వృద్ధులకు ప్రతి నెలా సుమారు 10 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇవే కాకుండా థెరపీ సేవలు ఉచితంగా అందిస్తున్నారు. ఇక ఎంతో మందికి సహారా స్వచ్ఛంద సంస్థ ద్వారా పునరావాస సేవలు అందిస్తున్నది. గ్రామీణులకు సమగ్ర ఆరోగ్య సేవలు ఉచితంగా అందించడమే లక్ష్యమని సహారా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మటం శంకర్ తెలిపారు.

నేడు టేక్మాల్‌లో ఉర్సు



ఉర్సుకు ముస్తాబైన దర్గా

టేక్మాల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టేక్మాల్‌లోని హజ్రత్ సయ్యద్ సాహెబ్ హుస్సేన్ ఖాద్రీ చిష్టి రహేతుల్లాలే 150 ఉర్సు ఉత్సవాలు నేడు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హుస్సేన్ ఖాద్రీ పేర్కొన్నారు. టేక్మాల్‌లోని కింది వాడ నుంచి గ్రంథం చాదర్‌ను ప్రత్యేక ప్రార్థనలతో ఊరేగింపుగా తీసుకొస్తారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని కాంగ్రెస్ మెదక్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మజర్ కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులు తప్పకుండా గెలుస్తారని పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రణాళికతో కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని, ఎక్కడ ఎన్నికల ప్రచారం నిర్వహించినా వస్తానన్నారు. ప్రజల సమస్యల కోసం ముందుండి కొట్లాడే పార్టీ బీజేపీయే అన్నారు. ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, దేశ్‌పాండే పాల్గొన్నారు.

పేదల భూములను కార్పొరేట్లకు ఇచ్చే కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దశరథ్

సదాశివపేట, జూలై 21: (ఆంధ్రజ్యోతి) : పేదలు సాగు చేసుకుంటున్న భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దశరథ్ పేర్కొన్నారు. సోమవారం సదాశివపేటలో సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, మహ్మదాపూర్, మునిదేవునిపల్లి గ్రామాల్లో సర్వే నెంబర్లు 418లో 44 ఎకరాలు, 22లో 311 ఎకరాలు, 92లో 293 ఎకరాలు, సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలో సర్వే నెంబర్లు 263, 268లల్లో 190 ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు కార్యాచరణ ప్రారంభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు 50 ఏళ్లుగా రైతులు భూములను సాగు చేసుకుని బతుకుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం భూసేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షఫీ అహ్మద్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

చేర్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని చేర్యాల పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ విషయమై సోమవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై నవీన్ వివరాలను వెల్లడించారు. చేర్యాల పట్టణంలోని పెద్దమ్మ కాలనీలో బంగారు శ్యామల, ప్రమీల ఇళ్లల్లో ఈ నెల 18న దొంగతనాలకు పాల్పడి మొబైల్ బంగారు వస్తువులతో పాటు, నగదు, దోచుకుపోయారని బాధితులు దరఖాస్తులు ఇవ్వగా పరిశోధన ప్రారంభించినట్లు తెలిపారు. హైద్రాబాద్‌లోని మౌలాలి కైలాసగిరి హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన వారి మేనల్లుడైన నల్ల జీవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గతంలో జరిగిన గొడవలలో పాత కక్షలు మనసులో పెట్టుకుని దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. జీవన్ కుమార్ నుంచి 13గ్రాముల బంగారు చెవి కమ్మలు, 5 గ్రాముల బంగారు ఉంగరం, మొబైల్ ఫోన్, రూ.2 వేల నగదు స్వాదీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు

● విద్యార్థుల ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలి



విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇరువురి బీసీ హాస్టల్ విద్యార్థుల ఆత్మహత్యాయత్నంపై విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీజేపీ నాయకులతో కలసి హుస్నాబాద్ పట్టణంలోని బీసీ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల అలవాట్లలో మార్పులు జరిగి చెడు అలవాట్లకు పాల్పడ్డారన్నారు. అర్ధరాత్రి విద్యార్థులు బయటకు వెళ్తుంటే హాస్టల్ వార్డెన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరియోగుల అనంత స్వామి, గాదాసు రాంప్రసాద్, నారోజు నరేష్, పోలోజు రాజేందర్‌చారి, బోనగిరి రాజేశ్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తొగుట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తొగుటలో సీత కిషన్ కుటుంబానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సోమవారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీజెపి సీనియర్ నాయకులు వెంకట్రాముల బాల్‌రెడ్డి, పాగాల రాజిరెడ్డి, దుర్గాప్రసాద్, నాగరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేబుల్ ఆపరేటర్ల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని కార్మిక భవన్ లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్ సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా నూతన అధ్యక్షుడిగా రమేష్ చందర్ (కొండపాక) ప్రధాన కార్యదర్శిగా ఇట్టమైన బాబు (చిన్నకోడూరు) కోశాధికారిగా గడ్డం శ్రీనివాస్ గౌడ్ (సిద్దిపేట) ఏకగ్రీవ ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా గోపాలస్వామి, ఉపాధ్యక్షులుగా చిలువేరు భగవాన్ (కోహెడ) బీర్కూర్ రవీందర్ (చేర్యాల) పోలోజు మల్లేశం (నంగునూరు) దుర్గాదాస్ (తొగుట) సహాయ కార్యదర్శులుగా ముత్యాల సంతోష్ రెడ్డి (సిద్దిపేట) పోతారం మురళి (మిరుదొడ్డి) నాగయ్య (బెజ్జంకి) ఐలయ్య (మద్దూరు) ఎన్నికయ్యారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, శశిధర్ మాట్లాడారు. జిల్లాలోని కేబుల్ ఆపరేటర్లందరూ ఏకతాటి పైకివచ్చి తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేయాలన్నారు.

తాగునీటి కటకట

● మిషన్ భగీరథ నీరు రాక, మోటర్ కాలిపోయి తిప్పలు
● ట్యాకర్ ద్వారా అరకొర నీళ్లు



కాలిపోయిన బోర్ మోటర్‌ను తీయిస్తున్న కనకరాజు(ఫైల్‌ఫోటో)



గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా

దౌల్తాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి గ్రామంలో 3 నెలలుగా మిషన్ భగిరథ నీళ్ల రాక, గ్రామ పంచాయతీ బోర్ పాతదై కాలిపోయింది. బోర్ రిపేరు చేయడానికి డబ్బులు లేక గ్రామ ప్రజలు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం గ్రామ ప్రజలకు అరకొర నీళ్లతో గ్రామానికి చెందిన రైతుల బావుల వద్ద నుంచి నీటిని అందిస్తున్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా మాజీ సర్పంచ్ మార్కింటి కేత కనకరాజు గ్రామానికి నీళ్లను అందజేస్తున్నారు..

కొత్త బోర్ మోటర్ కావాలి

మా గ్రామ పంచాయతీకి దండిగా నీళ్లున్న బోర్ బావి ఉంది. కానీ మోటర్ పాతదై ఎన్ని సార్లు బాగు చేయించిన కాలి పోతుంది. మా గ్రామానికి నీళ్ల గోసపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి,ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా కలెక్టర్, స్పందించి మా గ్రామానికి కొత్త బోర్ మోటర్ అందించి మా నీళ్ల బాధ తీర్చాలని గ్రామ ప్రజల పక్షాన కోరుతున్నా.

- మార్కింటి కేత కనకరాజు, మాజీ సర్పంచ్, లింగరాజుపల్లి

చినుకుపడితే.. చిత్తడే



బురదమయంగా మారిన దుబ్బాక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం



చినుకులకే బురదమయంగా మారిన మున్సిపల్ కార్యాలయ ఆవరణ

దుబ్బాక, జూలై21 (ఆంధ్రజ్యోతి): అవి అభివృద్ధికేంద్రాలు... నిధులను వినియోగించడానికి పాలనాధికారాలుగల స్థానిక సంస్థలు కొలువుతీరే కార్యాలయాలు... ఒకటి గ్రామాల అభివృద్ధిని చేపట్టే మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం అయితే.. మరోకటి పట్టణాభివృద్ధికి దోహదపడే పురపాలిక కార్యాలయం.. ఇక్కడినుంచే నిధులను కేటాయించే, కార్యాలయాలు బురదగుంటలో కొలువుతీరుతున్నాయి. దుబ్బాక మండలపరిషత్ అభివృద్ధికార్యాలయం ఆవరణలోనే మున్సిపల్ కార్యాలయం, దుబ్బాక మున్సిఫ్‌కోర్టు, ఐసీడీఎస్ కార్యాలయం, మండలవిద్యాధికారి కార్యాలయాలు ఉన్నాయి. ఆ ఆవరణలో పూర్తిగా గుంతలు, అవరణ చదునులేకపోవడం వల్ల చినుకుపడితే, చిత్తడిగా మారుతుంది.బురదగుంటలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. కోర్టుకు వచ్చే ప్రజలకు, ఆయా కార్యాలయాలకు వచ్చే వారికి బయట వేచి ఉండాల్సి వస్తే, దోమలు, బురదతో నరకయాతనం పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. కనీసం సిమెంటు రహదారి వేస్తేబాగుండునని ప్రజలు కోరుతున్నారు.

బకాయిల బెడద

(5వ పేజీ తరువాయి)

ఇరవై రోజులుగా ఉపాధ్యాయులే సిలిండర్‌పై వంట చేస్తూ విద్యార్థులకు వడ్డిస్తున్నారు.

అప్పులు చేసి వంట చేస్తున్నాం

బిల్లులు చెల్లించాలని అధికారులకు విన్నవించాం. కొత్త మెనూ అమలు చేయాలంటే పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలి.బిల్లులు తక్షణమే చెల్లించాలి.

- లక్ష్మీ, వంట కార్మికురాలు

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. మూడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిట్టుబాటు కాకపోగా అప్పులు పెరిగాయి. ప్రభుత్వం నెలనెలా బిల్లులు చెల్లించాలి. కొత్త మెనూ అమలు చేయాలంటే వారికి అనుగుణంగా ధరలు కూడా పెంచాలి.

- ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

మెనూ అమలుకు చర్యలు

పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు పాఠశాలలను పర్యవేక్షిస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న బిల్లులు రాగానే వారి ఖాతాలో జమ చేస్తాం.

-మాధవరెడ్డి, ఎంఈవో, జగదేవ్‌పూర్

సత్యసాయి సేవలు మరువలేనివి

● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవలు మరువలేనివని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సత్యసాయి వందవ జయంతిలో భాగంగా గజ్వేల్ పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న దేవతామూర్తుల కల్యాణ మహోత్సవానికి ఆయన హజరై, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, మెమొంటోను అందజేశారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. సత్యసాయి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, వైద్యం, విద్య అందించారని, తాగునీటికి అనేక గ్రామాల్లో కటకట లేకుండా చూశారన్నారు. ఆయనవెంట ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు ఆర్కే శ్రీనివాస్, తోట శ్రీనివాస్, సత్యసాయి సేవా సమితి సభ్యులు తదితరులున్నారు.



మాజీ మంత్రి హరీశ్‌రావుకి మెమొంటోను అందజేస్తున్న ఆలయ అధికారులు

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

గజ్వేల్ మండలం సింగాటం మాజీ సర్పంచ్ బెండే లలిత అనారోగ్యంగా ఉన్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆమెను పరామర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఆమె నివాసంలో పరామర్శించి, ఆరోగ్య క్షేమ సమాచారాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బెండే మధు తదితరులున్నారు.



మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థుల బోనాల వేడుకలు

కేజీబీవీలో బోనాల పండుగ

మద్దూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం విద్యార్థులు బోనాల పండగను ఘనంగా ఉపాధ్యాయులతో కలిసి జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని నివేదించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతురాజు వేషధారణలతో అలరించారు. బోనాల పండగ ప్రాముఖ్యతతో పాటు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

చేర్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్య ఏమిటో తెలుసుకుని పరిష్కంచాలని సిబ్బందికి హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచించారు. వారిక తనిఖీల్లో భాగంగా సోమవారం చేర్యాల పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వర్టికల్ వారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. విజిబుల్‌పై దృష్టి సారించాలని, ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

ప్రయోగాత్మక బోధనకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి 5 పాఠశాలలకు చెందిన 15 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటారు. భౌతిక, గణిత, జీవశాస్త్ర సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ శిక్షణను పొందనున్నారు. ఇప్పటికే సంబంధిత మండల విద్యాధికారుల ద్వారా పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు మేలు ప్రయోగాల ద్వారా విషయాలను బోధించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యంతో పాటు, పాఠ్యాంశాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, కొత్త ఆవిష్కరణలకు ఈ ల్యాబ్‌లు వేదికగా దోహదపడతాయని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అన్నారు. ఉపాధ్యాయులకు అందించే ఈ శిక్షణ వారిలో బోధనా నైపుణ్యాన్ని మరింత పెంచి విద్యార్థులకు మేలు చేకూరుస్తుందని అభిప్రాయపడ్డారు.

అబద్ధపు హామీలతో గద్దెక్కిన కాంగ్రెస్

బెజ్జంకి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెక్కి ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ చేసినమోసాలను ప్రజలకు వివరించి, బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేసి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని తెలిపారు. కార్యకర్తల కృషితోనే పార్టీ బలోపేతం సాధ్యమవుతుందని, ప్రతి కార్యకర్త పార్టీ పట్ల నిబద్ధతతో ఉండాలన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించండి



రాఖీ సెంటర్ పరిశీలిస్తున్న ఏసీపీ

కొండపాక, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారి పక్కన ఏర్పాటైన మహేష్ మెగా రాఖీ హోల్ సేల్ షాపును గజ్వేల్ ఏసీపీ నరసింహులు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తో కలిసి సోమవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ నరసింహులు రాఖీ సెంటర్ యజమానికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఫైర్ యాక్సిడెంట్ కాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. రాఖీలు కొనుగోలు చేయడానికి వచ్చే వాహనాలను రాజీవ్ రహదారి పక్కన కాకుండా షాప్ పక్కన పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షాపు ఎదురుగా పార్క్ చేస్తే రహదారిపై వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందిగా ఉంటుదన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. షాపు చుట్టుపక్కల ఎదురుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా వాచ్ మెన్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది జరగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార సాధనే మహనీయులకు ఇచ్చే నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న విశారధన్ మహారాజ్

హుస్నాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన వర్గాల రాజ్యాధికారాన్ని సాధించడమే మహనీయులైన పూలే, అంబేడ్కర్, కాన్షీరామ్‌లకు ఇచ్చే నిజమైన నివాళి అని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాజ్యాధికార ధర్మ యుద్ధ అవగాహన సదస్సులో మాట్లాడారు. అణగారిన వర్గాల ప్రజలకు రాజ్యాధికారంలో, సంపదలో, భూమిలో వాటా ఇవ్వకుండా కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే ఈ పాలకవర్గాలు చూస్తున్నాయన్నారు. బీఆర్ అంబేడ్కర్ కల్పించిన ఓటు హక్కును బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజానీకం సరిగా వినియోగించుకున్నప్పుడు మాత్రమే తమ కష్టాలకు, కన్నీళ్లకు, సమస్యలకు పరిష్కారం దొరకుతుందన్నారు. ఈ సదస్సులో పాలమూరి యూనివర్సిటీ ప్రొఫసర్ నాగం కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రామయ్య యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్, తదితరులున్నారు.

మల్లన్న సేవలో అదనపు కలెక్టర్



స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు,అర్చకులు

కొమురవెల్లి, జూలై21(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ దంపతులు కుటుంబ సమేతంగా సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ స్వామివారి చిత్రపటాన్ని అదనపు కలెక్టర్ దంపతులకు అందించారు. అనంతరం ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సన్మానించి వేద ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు,ఎంపీడీవో శ్రీనివాస్ వర్మస్థానిక పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలి

●పీఏసీఏస్ చైర్మన్ రమేష్ గౌడ్

నంగునూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నంగునూరు సహకార సంఘం చైర్మన్ కోల రమేష్ గౌడ్ అన్నారు. సోమవారం నంగునూరు మధిర హుస్సేన్ నగర్‌లో అర్హులైన వారికి ఎమ్మెల్యే హరీశ్‌రావు కోటాలో మంజూరైన ఇళ్లకు ముగ్గుపోసి మాట్లాడారు. ఈ సందర్భంగా గూడు లేని వారికి నీడ కల్పించాలని లక్ష్యంతో అర్హులైన వారికి ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెలికాని యాదగిరి, తుపాకుల శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు, చింతల రాం రెడ్డి, కరీం బాయ్, హసే న్, అనిల్ గ్రామ పంచాయితీ సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

42శాతం బీసీ రిజర్వేషన్లలో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం

సిద్దిపేట అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చే హామీని ప్రభుత్వం అమలు యాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేదంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి నష్టం కలుగుతుందని తెలిపారు. జనాభా ప్రకారం బీసీ జనాభాలో అత్యధిక వర్గం ముదిరాజ్‌లు ఉన్నారని 42శాతం బీసీ రిజర్వేషన్లలో ముదిరాజులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెప్మా లక్ష్యాలైన విద్యా ఉద్యోగ సాధికారిక కోసం జాబ్ మేళాలను నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కనకరాజు, పట్టణ కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు దర్శన్, నాయకులు యాదగిరి, శ్రీనివాస్, సంతోష్, కరుణాకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ లో చేరిన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు

నంగునూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల గ్రూప్ తగాదాలు ఎక్కువయ్యాయని అవి భరించలేక తాను కాంగ్రెస్ పార్టీ వీడి టీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు నంగునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు బండారి రాజు తెలిపారు. సోమవారం మాజీమంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత కలహాల కారణంగా కాంగ్రెస్ పార్టీలో కింది సాయి కార్యకర్తలకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారికే మాత్రం ఇల్లు కేటాయిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు నవీన్, రమేశ్, మనోజ్, రాజకుమార్ ,నరేందర్ రెడ్డి, అనిల్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

సంఘానికి ఆపాదించడం సరికాదు



మాట్లాడుతున్న కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్

కొమురవెల్లి, జూలై21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొందరు వ్యక్తులు వ్యక్తిగత గొడవలను కల్లుగీత కార్మిక సంఘానికి ఆపాదించడం సరికాదని జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం దొడ్ల విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 9న కొమురవెల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను సంఘానికి ఆపాదించడంతో పాటు వైరాలను పెంచడం సరికాదన్నారు. కల్లుగీత కార్మికుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించే సమయంలో ఇలాంటివి జరగడం బాధకరమన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

చిన్నకోడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వాలని ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. చిన్నకోడూరు పోలీసు స్టేషన్ పరిధిలోని నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఇరు కుటుంబాల మధ్య జరిగిన గొడవ విషయమై సోమవారం సీఐ శ్రీను, స్థానిక ఎస్సై సైఫ్ అలీ ఇరు వర్గాల వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడారు. ప్రతి సమస్యకు ఓ మార్గం ఉంటుందన్నారు. చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.